# తెగింపు

చంద్రమ్మ వస్తూనే చేదా, పెద్ద బకెట్టూ నూతికి పట్టుకెళ్ళి రెండుకుండల నిండా నీళ్ళు నింపేసింది. ఇంట్లోకి కుళాయి నీరు తెచ్చి పెట్టేసింది. అంట్లు చకచకా తోమేసి వెళ్ళటానికి సిద్ధమై "వస్తానమ్మా" అని నిలుచుంది.

గిరిజకు ఆశ్చర్యం కలిగింది. చంద్రమ్మ ఒట్టి వాగుడుకాయ. వచ్చిన దగ్గరనుంచీ ఎక్కడలేని కబుర్లూ చెప్పేస్తూ ఉంటుంది. తమ పని చేసే పదిళ్ళలో జరిగే సంగతులూ, పట్నంలో మారే సినిమాలూ, అది చూసిన సినిమాల్లో దానికి నచ్చిన సంఘటనలు అలా వల్లిస్తూనే వుంటుంది. కబుర్లు ఎంతలా చెప్పినా, అరగంటలో దాని పని అది పూర్తి చేసుకొనిపోతుంది. అదొచ్చి వెళితే గాలివాన వచ్చి వెళ్ళినట్లే వుంటుంది. అలాటిది ఉదయం నుండి ఇవాళంతా దాని పని అది చేసుకు వెళుతూందే కానీ ఒక ఉలుకూ, పలుకూ లేదు. "ఏమే, చంద్రి! ఈవాళ హుషారుగా లేవు. పొద్దుట్నుంచీ చూస్తున్నాను" అంది గిరిజ.

చంద్రి భారంగా నిట్టూర్చింది. పైటతో ముఖానికి పట్టిన చెమట తుడిచేసుకుంటూ, "ఏం జలమవమ్మా? ఈ ఎదవ ఆడజల్మం ఎత్తినకంటె కుక్కజల్మం ఎత్తితే మంచిదమ్మా" అంది "నీ కేమొచ్చిందే ఈ రోజంత విరాగివయిపోయావు" అంది.

"అవునమ్మా, ఆ సీతమ్మోరి నుండి నాలాటి ఆడదాని దాకా సూసినా ఏ ఆడదాయి సుకపడ్డాది సెప్పండి. రెక్కలు ముక్కలు సేసుకుని నానా కట్టాలు పడినా, ఇంటికాడ సిటం తీరిక లేక గొడ్డు సాకిరి సేసినా, ఆడదాయినింకా పాదాలతో అడిసెయ్యాలనే ఈ మొగోడు సూత్తాడు గానీ, 'అయ్యో! అదీ మడిసే గదా అన్న గేనం ఉండదుకదమ్మా! ఇలాంటి ఎదవబతుకులు బతికేకంటే ఇంత ఇసం తాగి సావడం మంచిది" అంది.

అలాగన్నపుడు చంద్రి గుండె ఆవేశంతో ఎగిసిపడింది. ముక్కుపుటాలు అదిరాయి. ముఖం నిండా విషాదం చంద్రుణ్ణి చుట్టిన మబ్బుల్లా వున్నాయి. చంద్రి ముఖం ఎండకు వాడిన కుసుమం అయింది. స్వచ్ఛమైన దాని మనసు పంకిల సదృశమైంది. క్రితం రోజు జరిగిన సంఘటన దాని మనసును కలచి వేస్తూనే వుంది.

చంద్రిలాగే పదిళ్ళలో పనిచేసే పారమ్మ చంద్రికి ప్రాణ స్నేహితురాలు. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. రెండుమెతుకులు తిని మొగుడొస్తే కూడు పెట్టేసి కునుకు తీయాలనుకుంది చంద్రి. వాడింకా రాలేదు. కంటికి కునుకు వస్తే అలా సాగోరింది. పారమ్మ వచ్చి చంద్రిని లేపేసింది. "అవునే, సెంద్రీ ఎంకటేశ్వరానికి 'నవకుశులు' వచ్చినాదట. ఎల్దా వస్తావటే?" అంది.

ఆడదాయి మీద సెయ్యేసేసుకున్నారో మక్కలిరిగిపోగలవు. అంతేకాదు మీరు గడించిన డబ్బులు మా సేతిలో పెట్టి ఆయనక మీరెలా తగలడతారో తగలడండి". అంది అందరూ వంత పలికారు. తోకముడుచుకున్న కుక్కల్లా ఒక్కొక్కరు జారుకున్నారు. సర్దుమణిగింది.

జరిగిన సంగతంతా చెపుతూంటే గిరిజ ఆశ్చర్యంలో వుండిపోయింది. చంద్రిని చూస్తుంటే గిరిజకు చాలా ఆనందం కలుగుతుంది. చంద్రి నువ్వలా ఎదురు తిరిగితే మీ ఆయన ఊరుకున్నాడా? అంది అమాయకంగా.

"వూరుకోక ఏం జేస్తాడమ్మా. ఉరెట్టుకుంటాడా? పీక తీస్తాడా? అమ్మా ఈ మొగాల్లకి బయపడినంతకాలం ఆడదాన్ని ఇలాగే వంచుతూనే వుంటారు. పిల్లిని కూడా తలుపులేసి కొడితే తిరగబడతాదని ఆలకి మాత్రం తెలీదేటమ్మా. ఆడదాయి ఓరిసినంతకాలం ఓరుస్తాది. మనసిరిగిందో, అమ్మోరవుతాది". అంటున్న చంద్రిని మరింత ఆశ్చర్యంగా చూసింది. ఇంట్లోకెళ్ళి ఫ్లాస్కులో కాఫీని గ్లాసులో పోసి చంద్రికి ఇచ్చింది గిరిజ. కాఫీ తాగి వస్తానంటూ వెళ్ళిపోయింది.

వాలు కుర్చీలో వాలిన గిరిజ చెవుల్లో చంద్రి అన్నమాటలే చెవుల్లో గింగిర్లు పెడుతున్నాయి. నిజమే! చంద్రినుంచి నేర్చుకోవలసింది ఎంత ఎంతో వుందనిపించింది.

చంద్రికి చదువులేదు. డబ్బులేదు. సంస్కారం లేదు. కాని తెగింపువుంది. తన జీవితాన్ని రక్షించుకోగలిగిన శక్తి వుంది. ధైర్యం వుంది. కాని - తనకో?

చదువు వుంది. డబ్బు వుంది. అంతస్తులున్నాయి. తెలివితేటలు వున్నాయి. కానీ తెగింపు లేదు. జీవితం చిరిగిన విస్తరవుతుంటే దాన్ని సరిచేసుకునే శక్తి లేదు.

గిరిజ తండ్రి బాగా డబ్బున్నవాడు. తండ్రికి గిరిజ ఒక్కతే కూతురు. గిరిజని అల్లారుముద్దుగా పెంచాడు తండ్రి. పువ్వుకంటే కోమలంగా చూసుకున్నాడు. గిరిజ బి.ఎస్సీ వరకూ చదువుకుంది. కాలేజీ రోజుల్లో గిరిజ చేసిన అల్లరి విపరీతం మగపిల్లల్ని తెగ ఏడిపించేది.

బి.ఎస్సీ అయిన తరువాత లక్షరూపాయలు కట్నం పోసి తనకంటె బాగా ఆస్తివున్న లక్ష్మణరావుతో కూతురిపెళ్ళి జరిపించాడు గిరిజ తండ్రి. లక్ష్మణరావు కూడా పాలిటెక్నికల్ సివిల్ పాసై కొన్నాళ్ళు ఉద్యోగం చేశాడు. కాని దానివలన ప్రయోజనం లేదని దానికి రిజైన్ చేసి కాంట్రాక్టులు చేయటం చేపట్టాడు. కాంట్రాక్టులు చేపట్టిన నుండి లక్ష్మణరావు వ్యక్తిగతంగా బాగా మారిపోయాడు. ఒక్క క్షణం కూడా తీరిక లేకుండా అయిపోయాడు.

పెళ్ళయిన మొదటి సంవత్సరం గిరిజకు బాగా గడిచిపోయింది. తరువాత కొడుకూ, మరో సంవత్సరం తరువాత కూతురూ పుట్టారు. అక్కడితో గిరిజ జీవితానికి ఫుల్‌స్టాపు అయింది. లక్ష్మణరావు ఇంటి కొచ్చేసరికి రాత్రి ఒంటిగంటా రెండూ అయ్యేది ఇంటికొచ్చేసరికి మంచి నిషాలో

వచ్చేవాడు తరువాత భోజనం కూడా చేసేవాడు కాదు భర్తవస్తే కలసి భోజనం చేద్దామనే గిరిజకి నిరాశే ఎదురయ్యేది తరువాత ఇంటి దగ్గరే తాగటం మొదలు పెట్టాడు.

ఒకరోజు లక్ష్మణరావుతో గొడవకు దిగింది గిరిజ తాగబోతున్న అతని ముందు నుండి సీసా, గ్లాసులూ లాగేసింది వీల్లేదంది లక్ష్మణరావు ఎంత చెప్పినా వినలేదు. కొంతసేపు కేకలేసుకున్నారు. తరువాత గిరిజ చెంప చెళ్ళుమంది. అది గిరిజ ఊహించని పరిణామం.

పౌరుషంతో గిరిజ ముఖం కందిపోయింది. కళ్ళు అగ్నిగోళాలయ్యాయి. తోక తొక్కిన తాచయింది. ఉరిమిన మేఘం కుంభవృష్టి అయినట్లు తరువాత వెక్కి,వెక్కి ఏడ్చింది. "తాగండి, మీ ఇష్టం వచ్చినట్లు తాగండి. అంతేకాదు. ఇంకేం వేషాలేయాలనుకుంటున్నారో అన్నీ వేయండి. ఇవాల్టి నుండి మీరేం చేసినా మీరెన్ని వెధవ పనులు చేసిన మిమ్మల్నీ అడిగితే ఒట్టు. భార్యను కొట్టే నీచస్థితికి దిగజారారు. మీరు ఒక మనిషేనా?'' అని అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది. ఆ రాత్రల్లా ఏడుస్తూనే వుంది. రోజులు గడిచే కొద్దీ గిరిజ బ్రతుకు మరింత నరకం అయింది. లక్ష్మణరావుతో ఇంటికి అప్పుడప్పుడు అందమైన అమ్మాయిలూ వస్తుంటారు. వాళ్ళు చాలా సేపు మేడగదిలో కూర్చుంటారు. తాగుతారు. కేరింతలు కొడతారు. వెళ్ళిపోతారు. అయితే వారెవరనీ, ఎందుకొచ్చారనీ గిరిజ లక్ష్మణరావును ప్రశ్నించలేదు. గిరిజ మనసును రాయి చేసుకుంది. జీవితం యాంత్రికం అయింది. ఇపుడు గిరిజలో వెనుకటి ఉత్సాహం లేదు. హుషారు లేదు. ఏ పని చేయాలన్న ఉత్కంఠ లేదు.

గతం కళ్ళముందు తిరిగిన గిరిజ మనసు బాధతో నలిగిపోయింది. కన్నీరు వరదలైపారింది.

"కాలేజిలో చదువుకునే రోజుల్లో వరకట్న నిషేధం మీద, వుమెన్ లిబర్టీమీద ఎన్నెన్నో ఉపన్యాసాలిచ్చేది. అవన్నీ నిజజీవితానికి ఎందుకు వర్తించకుండా పోయాయి? తనలో ఎందుకింత పిరికితనం చోటు చేసుకుంది? నైరాశ్యం గూడు కట్టుకుంది.? చంద్రిలాగా తెగించి ఎదురు తరిగితే లక్ష్మణరావు ఏం చేయగలడు?''

చంద్రిలాగా ఎదిరించాలన్న తెగింపు వచ్చిన గిరిజకి కొండంత బలం వచ్చింది. తెలియని ఉత్సాహం వచ్చింది. కొత్త ఆశ చిగురు తొడిగింది.

(28-12-1983 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నుంచి)

✽ ✽ ✽ ✽